క్లుప్తంగా

జెడ్పీ పాఠశాల పరిశీలన



నిమ్మకూరు(పామర్రు): మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో జెడ్పీహైస్కూల్‌ను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. నాడు–నేడు కింద కల్పించిన అదనపు సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యం విద్య లపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతోందన్నారు. నాడు–నేడు పథకం ఫేజ్–2లో రూ.69 లక్షల నిధులతో పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, విద్యార్థులకు మరుగుదొడ్లు, లైబ్రరీ తదితరాలను నిర్మించామన్నారు. కొత్తగా నిర్మించిన గదులు, టాయిలెట్స్‌ను శుభ్రం చేయించి విద్యార్థులు వినియోగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీలత, విద్యాకమిటీ చైర్మన్ విజయశాంతకుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమలత, ఉపాధ్యాయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పమిడిముక్కల: మండలంలోని మేడూరు గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లోయ బ్రదర్స్, పీఏసీఎస్ అధ్యక్షుడు మినుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, నరములు, ఇతర రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివాన్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ కొల్లి చందన, ఇతర వైద్యులు ఈ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, బొగ్గారపు తిరుపతయ్య, ఎంఆర్ ప్రసాద్, ఎల్ఈ వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 25 మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణానికి రూ.1.50 కోట్ల ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. మండలంలో మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణాలు పూర్తయ్యాక అన్ని ప్రాంతాల్లోని శ్మశాన వాటికల్లో షెడ్లను నిర్మించనున్నారు. జిల్లా పరిషత్ తరఫున మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చేపట్టారు. ఆ శిక్షణ మండలంలో పూర్తి అయ్యింది. శిక్షణ పూర్తయిన మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు
- మహారాజగోపుర నిర్మాణానికి రూ.3 కోట్లు
- దాత, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): అతి పూరాతనమైన కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఈ నెల 15న దేవాలయం వద్ద ఆలయ మహారాజగోపుర నిర్మాణం, ఆలయ పునఃనిర్మాణం అంశాలపై జరిగే భారీ బహిరంగ సభ నిమిత్తం ముందస్తు సమావేశం దేవాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహారాజగోపుర నిర్మాణానికి రూ.3 కోట్లను దాత, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందిస్తున్నారన్నారు. సమీక్ష సమావేశానికి దేవదాయ ధర్మదాయశాఖ స్థపతులు, అధికారులతో కలసి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమీక్ష సమావేశానికి విచ్చేస్తారన్నారు. గ్రామ ప్రముఖులు సూచనలు, సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, నీలపాల వెంకటేశ్వరరావు, చెరుకువాడ బాలరామరాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, సర్పంచ్ మసీముక్కల మారుతి ప్రసన్న, అడవి ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గడప గడపలో ఆనందం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- మామిళ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



మామిళ్లపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: జగనన్న పాలనలో గడప గడపలో ఆనందం నెలకొందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మామిళ్లపల్లి–గంద్రపువాని గూడెం రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం సమకూర్చిన పథకాల వివరాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. రహదారి అభివృద్ధికి చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం, ఎంపీటీసీ జుఝువరపు శృతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, గంద్రపు వెంకటేశ్వరరావు, కొడాలి రవి, కొడాలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి పుట్టలో పాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద, గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

ఎండుతున్న వరి ఆకుమడులు



వానపాముల(పెదపారుపూడి): విద్యుత్ బోర్లపై ఆధార పడి ఖరీఫ్ వరి ఆకుమడులు పోసిన అది కాస్తా మండల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా ఎండిపోతున్నాయని మండలంలోని వానపాముల గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలోని పంట పొలాల్లో వారం రోజుల కితం విద్యుత్ స్తంభం విరిగి లైన్ల తీగలు పంట పొలాల్లోని భూమి మీద పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయితే వారం రోజులు దాడుతున్నా తీగలు సరి చేయ లేదు. దీంతో బోర్లపై ఆధార పడి కొందరు రైతులు పోసిన ఆకుమడులకు నీరు అందకపోవటంతో ఎండిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. విపరీతమైన ఎండలకు ఆకుమడులు కళ్లముందే నాశనం అవుతుంటే ఏమి చేయాల్లో తెలియటం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏడీఈ దశరథ్‌ను వివరణ కోరగా సోమవారం సమస్యను పరిష్కరిస్తామన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత అలీనఖీపాలెం జట్టు

- వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాలు
- క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే కైలే



వీరంకిలాకులో వైఎస్సార్ విగ్రహం వద్ద అలీనఖీపాలెం క్రికెట్ జట్టు

పమిడిముక్కల: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని అలీనఖీపాలెం జట్టు కైవసం చేసుకొంది. టీడీపీ నిర్వహించిన పోటీలో అలీనఖీపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ క్రీడాకారులు సత్తా చాటారు. వీరంకిలాకు సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద జట్టు క్రీడాకారులు, నాయకులు విజయోత్సవం జరుపుకొన్నారు. ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో అలీనఖీపాలెం, ఐనంపూడి జట్లు పోటీపడ్డాయి. ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో విన్నర్‌గా అలీనఖీపాలెం జట్టు, రన్నర్‌గా ఐనంపూడి జట్టు నిలిచాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన అలీనఖీపాలెం జట్టు విన్నర్స్‌గా నిలవడం ప్రాధాన్యత సంతరించుకొంది. దీంతో నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, కోఆప్షన్ సభ్యులు దియానత్ అలీ, కుమేల్ ఆధ్వర్యంలో జైజగన్ అంటూ నినాదాలు చేశారు. మహానేత విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. క్రికెట్ పోటీలో గెలుపొందిన క్రీడాకారులను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అభినందించారు.

సమాజ చైతన్యానికి గ్రంథాలయాలు దోహదం



బహుమతులు స్వీకరించిన విద్యార్థులతో ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ

ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: సమాజాభివృద్ధితో గ్రంథాలయాల పాత్ర ఎంతో గొప్పదని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి రాఘవులు, హైకోర్టు న్యాయవాది రుద్రపాక రత్నారావు, కల్యాణి, ఆష్మా బేగం, ఎండీ.జకాఉల్లా, పార్వతీశ్వర్, లక్ష్మీ, రాజీ, రాంబాబు పాల్గొన్నారు. కలిదిండిలో గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, కలిదిండి, పడమటిపాలెం సర్పంచ్‌లు మారుతీప్రసన్న, సానా మీనసరస్వతీ హాజరయ్యారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణకు కృషి చేసిన కలిదిండి పబ్లిక్ స్కూల్, శశి స్కూల్ యాజమాన్యాలు సానా రాము, గొట్టిముక్కల సత్యనారాయణరాజును ఎంపీపీ సన్మానించారు. కార్యక్రమానికి సహకరించిన సాహితీ మిత్రుల సంఘం అధ్యక్షులు ఎల్ఆర్ పోలిశెట్టి, మసిముక్కు వెంకటేశ్వరరావు, డీవీ నరసయ్య, వివిధ పాఠశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



కైకలూరు: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పట్టణ సీఐ ఆకుల రఘు సూచించారు.కైకలూరులో అవగాహనకార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.వాహనాలు నడుపుతున్న బాలురను స్టేషన్‌కు తీసుకువచ్చి తండ్రులను పిలిపించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మేలు చేకూర్చిన వేసవి శిక్షణ



మండవల్లిలో బహుమతులు పొందిన విజేతలతో ఎంపీపీ, సర్పంచ్ తదితరులు



అగినపర్రులో బహుమతులు పొందిన విద్యార్థులతో సర్పంచ్ మణిరాజు, ఎంపీటీసీ శృతి



జమీగొల్వేపల్లిలో బహుమతులు స్వీకరించిన విజేతలతో ముఖ్యఅతిథులు



పామర్రులో విజేతలకు బహుమతులు అందిస్తున్న రంగవల్లి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



విజేతలైన విద్యార్థులతో గ్రంథాలయ ఉద్యోగులు



ముదినేపల్లిలో బహుమతులు పంపిణీ చేస్తున్న సర్పంచి కైకమ్మ

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించిపెట్టాయని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో జరిగిన గ్రంథాలయ విజ్ఞాన శిబిరాల్లోని విజేతలకు, సమ్మర్ క్యాంప్‌లో వివిధ పోటీల్లో విజేతలకు, ఎంపీపీ బహుమతులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో పిల్లలు ఖాళీగా ఉండటం వల్ల మొబైల్స్‌కి, వివిధ రకాల వ్యసనాలకు బానిస అవ్వకుండా ప్రభుత్వం గ్రంథాలయ శాఖ ద్వారా వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం పిల్లలకి చాలా ఉపయోగకరమన్నారు. సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు, సమ్మర్ క్యాంప్‌లో వివిధ పోటీల్లో విజేతలకు గిఫ్ట్‌బాక్స్‌లు, మెమెంటోలు అందజేశారు. సర్పంచ్ మెండా ఝాన్సీవైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని గురజాడ, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, అగినపర్రు, మేడూరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అగినపర్రులో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కోట మణిరాజు, ఎంపీటీసీ జుఝువరపు శృతి, లైబ్రేరియన్ బొబ్బా లావణ్య, గ్రామ పెద్ద బండి రాజబాబు పాల్గొన్నారు. కపిలేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి బుల్లా నాగమణి, ఎంపీటీసీ మరీదు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ జి.ప్రసాద్, లైబ్రేరియన్ ప్రతాప్‌కుమార్, పమిడిముక్కలలో ఉపాధ్యాయుడు ఇమడాబత్తిన దుర్గాప్రసాద్, లైబ్రేరియన్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. గురజాడలో మాజీ సర్పంచి గురజాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జెడ్పీహైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు ఆర్.రంగవల్లి అన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు సభ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వేసవి శిక్షణ సమయంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆర్ రంగ ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి, స్థానికులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. జమీగొల్వేపల్లిలో వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సభలో బహుమతుల ప్రధానం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సర్పంచ్ శాంతకుమారి, గుమ్మడి ఉషాదేవి, యోగా గురువు పీవీ ధర్మారావు, పి. పద్మావతి పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని గుడ్లవల్లేరు ప్రముఖుడు రామచంద్రరావు అన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఏర్పాటు చేసిన సదస్సులో ఆటలు, విజ్ఞాన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జీవీకే ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గతనెల 8వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆటలు, పాటలు, సంగీతం, వ్యాసరచన, చిత్రలేఖనం, పేపర్ బొమ్మల తయారీ, భగవద్గీత శ్లోకాల కంఠస్తం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు, టి.ప్రవల్లిక, వి.సునీత, పి. శాంతి విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా పరీక్షలు రాసే ప్యాడ్స్‌ను ఆదివారంపంపిణీ చేశారు. సర్పంచి చప్పిడి సమీరా, గ్రంథాలయాధికారి ఎంవీఎస్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ రకాల ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆదివారం ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రజుమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు జంపన కోటయ్య, ఈడే ఉమామహేశ్వరరావు, రియాజ్, జె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1974-75 బ్యాచ్ పదో తరగతి చదివిన విద్యార్థులు

పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1974–75 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా 48 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. చదువుకొనే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. హైస్కూల్‌లో నాడు–నేడు ద్వారా జరిగిన అభివృద్ధి పనులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. హైస్కూల్ అభివృద్ధి నేపథ్యంలో పేరెంట్స్ కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన 70 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.